ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్, జూలై 19: శాసన మండలి సభ్యురాలు సురభి వాణీదేవిని శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో వాణీదేవిని బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, లింగం గౌడ్, నాయకులు శరత్‌చంద్ర, మహేశ్‌నేత ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దఅంబర్‌పేట, జూలై 19: నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చంద్రమౌళి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జ్యోతిపురం, సూర్యమెడోస్, బ్రీజ్‌వ్యాలీ, హనుమాన్‌నగర్, లక్ష్మీగణపతి కాలనీ, రాఘవేంద్రకాలనీ, అన్నవరం సత్యనారాయణకాలనీ, ఆర్ఎన్ఆర్ 1, 2, పల్లవి ఇంజినీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలు, కుంట్లూరు జీవీఆర్ కాలనీ, నవోదయ ఎన్‌క్లేవ్‌లో కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తట్టిఅన్నారం, జీవీఆర్ కాలనీ, ఆర్కేనగర్, మర్రిపల్లి, వనస్థలిహిల్స్, కుత్బుల్లాపూర్, తిమ్మాయిగూడ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

షాబాద్, జూలై 19: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని తాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండలంలోని తాళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొన్ని రోజులుగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సులోచన, ప్రభాకర్, రమేశ్, జ్యోతి, రేణుక, సత్యనారాయణ, నర్సింహులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. అదే విధంగా తాళ్లపల్లి పాఠశాలకు వివిధ పాఠశాలల నుంచి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు మంజుల, లలిత, సీతాబాయి, మొగులయ్య, బాలకృష్ణ, భిక్షపతిలకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జాతీయ బాలల నాటకోత్సవం

షాద్‌నగర్‌రూరల్, జూలై 19 : షాద్‌నగర్ పట్టణంలోని హాజిపల్లి గ్రామశివారులోని ఏవీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం సంస్కార భారతి, నవకళా భారతీ ఆర్ట్స్ అకాడామీ షాద్‌నగర్ ఆధ్వర్యంలో జాతీయ బాలల బహుభాషా నాటకోత్సవాల కార్యక్రమాన్ని సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు సంస్కార భారతీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీ.విరంగయ్య తెలిపారు. ఈ జాతీయ బాలల నాటకోత్సవాన్ని రెండ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ నరేందర్‌తో పాటు పలువురు ముఖ్యనాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

రేపు మహంకాళి బోనాలు

ఇబ్రహీంపట్నం, జూలై 19 : ఆషాడమాసం సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ప్రసిద్ధిగాంచిన మహంకాళి అమ్మవారి బోనాలను ఆదివారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో పూజలు చేసి ఒడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో ముస్తాబుచేశారు.

గుంతల పూడ్చివేత

చేవెళ్లటౌన్, జూలై 19: మండల కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ రహదారి చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్ ఎదుట వర్షం పడి రోడ్డు పై గుంతలు పడి నీళ్లు నిలిచాయి. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో చేవెళ్ల గ్రామానికి చెందిన దండు సత్తి, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో కంకర పోయించి గుంతలను పూడ్చి వేశారు. వారి వెంట ట్రాఫిక్ ఎస్సై విఠల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శంకర్, నాయకులు ఉన్నారు.

ప్రభుత్వం రైతుల పక్షపాతి

షాద్‌నగర్‌రూరల్, జూలై 19 : ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రైతు రుణమాఫీ చేసి నిరూపించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండంలోని వెలిజర్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రైతుల రుణమాఫీ సంబురాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు బాలరాజ్‌గౌడ్, నాయకులు శివశంకర్‌గౌడ్, చెందితిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జాంగరి రవి, శేఖర్, గణేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, జూలై 19: ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు ఆనేగౌని దామోదర్‌గౌడ్ కోరారు. పలువురు గ్రామస్తులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని పులిమామిడి రెవెన్యూ పరిధిలోని 7-13ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని తెలిపారు. ఆ భూమిని ఫాం ల్యాండ్ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకొని గజాల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, శేఖర్, రవీందర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

పలు మున్సిపాలిటీల పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టిన సిబ్బంది

బొంగుళూరులో స్వచ్ఛ ఆదిబట్ల కార్యక్రమంలో చెత్తను తొలగిస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

తుర్కయాంజాల్ : మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

ఆదిబట్ల, జూలై 19: ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు, గంగానగర్‌కాలనీలో డ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆదిబట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి చెత్తను తొలగించారు. అనంతరం బొంగుళూరు గేట్ నుంచి పటేల్‌గూడకు వెళ్లే రహదారి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, ఏతా వీరాంజనేయులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాన్సన్, సురేశ్, గ్రామస్తులు రామారావు, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రత.. అందరి బాధ్యత

షాద్‌నగర్‌టౌన్ : పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యతని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మున్సిపాలిటీలోని 24వ వార్డులో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ నందీశ్వర్‌తో కలిసి పారిశుధ్య కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. వార్డులోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో వార్డుల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలని అధికారులకు సూచించారు. పరిశుభ్రతపై కాలనీవాసులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సాయిబాబా, రమేశ్, జవాన్ మల్లేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

ఆమనగల్లు : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ వసంత పేర్కొన్నారు. ఆమనగల్లు పురపాలక సంఘంలో డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అన్ని వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్‌తో సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 11వార్డులో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు యాదమ్మ, చెన్నకేశవులు, నాయకులు శ్రీశైలం మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తుర్కయాంజాల్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

షాబాద్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పత్తేపూర్ వార్డులో శుక్రవారం దోమల నివారణ, సీజనల్ వ్యాధుల నివారణ కోసం డ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మురుగుకాల్వలు, పరిసరాల్లో దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాములు, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, టీఎంసీ అనూష, వార్డు ఆఫీసర్లు, ఆశ వర్కర్లు, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్ టౌన్: చెత్తాచెదారాన్ని కార్మికులతో తొలగింపజేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్

ఆమనగల్లు మున్సిపాలిటీలో ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వసంత, చైర్మన్ రాంపాల్‌నాయక్

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పత్తేపూర్ వార్డులో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్ తదితరులు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహారావు

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

యాచారం, జూలై19: సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తి స్థాయిలో అవగాహన కలిగిఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నరసింహారావు అన్నారు. మండలంలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫెడెక్స్ మోసాలు, తక్షణ రుణ యాప్‌లు, ఓఎల్ఎక్స్, ఫిషింగ్ లింక్‌లు, స్క్రీన్ షేరింగ్ యాప్‌లు, క్యూఆర్ కోడ్, సోషల్ మీడియా ద్వారా నటించడం, లాటరీ, ఓటీపీ ఆధారిత, కస్టమర్‌కేర్, కేవైసీ వంటి తదితర మోసాలపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహారావు మాట్లాడుతూ.. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకు వివరాలను ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దన్నారు. ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దని, ఓఎల్ఎక్స్ లాంటి యాప్‌లతో మోసపోవద్దని సూచించారు. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే యాప్‌లు, కేవైసీల అప్‌డేట్ చేసుకోవాలని వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. లోన్‌లు ఇస్తామని, లక్కి డ్రా వచ్చిందని, లాటరీ తగిలిందని చెప్పే నేరగాళ్లను నమ్మొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్రమశిక్షణ విజయానికి నాంది

ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థులతో కమాండింగ్ ఆఫీసర్ రాకేశ్‌కుమార్

చేవెళ్ల రూరల్, జూలై 19 : విద్యార్థుల క్రమశిక్షణ వారి విజయానికి నాంది పలుకుతుందని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ రాకేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి జడ్పీ హెచ్ఎస్‌లో 2024-25 సంవత్సరానికి ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అర్జున్ కుమార్, సీటీవో మల్లిఖార్జున్, పీఐ స్టాఫ్ సభ్యులు సీహెచ్.వెంకటేశ్, జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఎమ్మెల్యే యాదయ్య

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్లటౌన్, జూలై 19 : పేదలకు ఆపదలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట మండలాలకు చెందిన 55 మందికి లబ్ధిదారులకు రూ.17లక్షల 99 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే యాదయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ దవాఖానల్లో చికిత్స పొందుతున్న పేదవారికి సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం లాంటిదన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా కృషి చేస్తాన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు, వసంతం, నాయకులు ఉన్నారు.

గ్రామ గ్రామానా మొక్కలు నాటాలి

మొయినాబాద్, జూలై 19 : వనమహోత్సవాన్ని ఓ యజ్ఞంలా కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సంధ్య అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆవరణంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నర్సరీల్లో మొక్కలను పెంచామని, అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌బాబు, పీఈడీ ఆదిబాబు, వైద్యుడు సాయిబాబారెడ్డి, కారోబార్ రాజేశ్‌కుమార్, బిల్ కలెక్టర్ దర్శన్ పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



పామెన గ్రామంలో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మొయినాబాద్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చేవెళ్ల రూరల్, జూలై 19 : చన్‌వల్లి ప్రభుత్వ పాఠశాలలో 1990-91 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం మండల పరిధి పామెన గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జంగారెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ బల్వంత్ రెడ్డి, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : మండల కేంద్రంలోని మెథడిస్ట్ రూరల్ చిల్డ్రన్స్ హై స్కూల్‌లో 2004-05లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు శుక్రవారం మండల పరిధిలోని సురంగల్ గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం. శ్రీకాంత్, కె.విక్రంరెడ్డి, సి.మధుసూదన్‌గౌడ్, ఎన్.మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల డబ్బులను చెల్లించండి

షాద్‌నగర్‌రూరల్, జూలై19: ఉపాధి హామీ కూలీల డబ్బులను వెంటనే చెల్లించండి అంటూ బీకేఎంయూ జిల్లా ప్రధానకార్యదర్శి జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కాశీరెడ్డిగూడ గ్రామంలో శుక్రవారం ఆయన ఉపాధిహామీ కూలీల సమస్యలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు 6, 7 వారాలుగా ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ కూలీల డబ్బులను వెంటనే చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, కూలీలు సునీత, రాములమ్మ, జయమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించే వరకు ఉద్యమం చేస్తాం

మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్

కందుకూరు, జూలై 19 : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్, సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. రిలే నిరాహార దీక్షలో భాగంగా కార్మికులు బతుకమ్మ ఆటలను ఆడి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సమయానికి భోజనం వండిపెట్టి వారి ఆకలి తీరుస్తున్న కార్మికులను ప్రభుత్వ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే కార్మికుల బిల్లులను చెల్లించపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

చాంపియన్ షిప్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

షాద్‌నగర్‌టౌన్, జూలై 19: హైదరాబాద్‌లోని కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న అంతర్జాతీయ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలకు షాద్‌నగర్ పట్టణ పరిధిలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, మాస్టర్ చెన్నయ్య శుక్రవారం తెలిపారు. ఈ పోటీలను శాలివన్ టైగర్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ ఫౌండర్, డైరెక్టర్ కన్నన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్ 19 కథాస్ విభాగంలో విద్యార్థులను విజయలక్ష్మి, శశిరేఖ, మమత, స్పైరింగ్‌లో అంకిత, ఐశ్వర్య, గీత, ఈరమ్మ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు యుద్ధ విద్యతో రాణిస్తుండడంపై కళాశాల ప్రిన్సిపాల్ శైలజ సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థినులను అభినందించారు.

విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, మాస్టర్ చెన్నయ్య

విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 19 : విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి నైపుణ్యతను పెంపొందించుకోవాలని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు అన్నారు. గుంతపల్లిలోని అవంతి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా విద్యనభ్యసించాలని సూచించారు. తాము అనుకున్న రంగాల్లో రాణించేందుకు నైపుణ్యతను పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానకార్యదర్శి ఎం. ప్రియాంక, డైరక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ స్వామిరావు, పీఆర్‌వో శ్రీనివాస్‌నాయుడు, అధ్యాపకులు ఉన్నారు.

బకాయిలు చెల్లించకుంటే.. అసెంబ్లీని ముట్టడిస్తాం

కందుకూరు, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సిద్దు కోరారు. లేని పక్షంలో వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీని ముట్టడిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం మండల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్, మండల నాయకులు వినోద్, సందీప్ యోగేందర్, శివ, అభిలాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోకాళ్లపై మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

హయత్‌నగర్, జూలై 19: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కాంట్రాక్టును అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగించడాన్ని నిరసిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్ మండల మధ్యాహ్న భోజన కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తంచేశారు. శుక్రవారం కొనసాగుతున్న కార్మికుల దీక్షకు ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ మద్దతు తెలిపి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఉమా, రమాదేవి, కవిత, రాధిక, సుశీల పాల్గొన్నారు.